క్లుప్తంగా

గణపతి ఉత్సవాలకు ఆహ్వానం



ఆనంద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రం ఇస్తున్న యాదవ యువత

మల్కాపురం: తమ ప్రాంతంలో నిర్వహించే వినాయక ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు శనివారం మల్కాపురం యాదవ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వానం అందజేశారు. ఈ మేరకు ఆనంద్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో కలిసి ఈ నెల 18వ తేదీ నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: భాద్రపద మాస శుద్ధ విదియ సందర్భంగా శనివారం తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తులసీ దళబిల్వార్చనలు నిర్వహించారు. భక్తులకు స్వామి ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు.

రజకులకు క్షమాపణ చెప్పాలి



58వ వార్డు కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: రజక సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన టీడీపీ శ్రేణులు తక్షణమే క్షమాపణ చెప్పాలని 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య డిమాండ్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన నిరసనలో రజకులను కించపర్చేలా మాట్లాడడం దారుణమన్నారు. మీ నేతపై అభిమానం ఉంటే మరో విధంగా చాటుకోవాలే తప్పా రజక సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడడం క్షమించరానిదన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని,లేని పక్షంలో పోరాటం చేస్తామన్నారు.

పోతిన సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సత్యాజంనేయ తదితరులు

మల్కాపురం: పేదల ప్రజల పక్షాన పోతిన సన్యాసిరావు చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. పోతిన 39వ వర్ధంతి సభను శనివారం మల్కాపురం గ్రామ మండలి వద్ద నిర్వహించారు. పోతిన సన్యాసిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా నాయకుడు కాండ్రేగుల సత్యాంజనేయ మాట్లాడుతూ సన్యాసిరావు నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటుపడేవారన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌ఎంఎం పార్కులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రూ.21 వేల జీతం దాటిన కార్మికులకు హెల్త్ కార్డులు, బోనస్ చెల్లించాలన్నారు. ఈ అంశాలపై సీజీఎంకు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు.

మట్టి విగ్రహం. పర్యావరణ హితం

● విస్తృతంగా మట్టి ప్రతిమల పంపిణీ

గోపాలపట్నం: వినాయక చవితి సందడి మొదలైంది. ప్రతీ వీధిలో మండపాలు వెలుస్తున్నాయి. అయితే వినాయక ఉత్సవాలను పర్యావరణ హితంగా.. ప్రశాంతంగా జరుపుకోవాలని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు. అందుకు తగిన విధంగా మండపాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. ఈ మేరకు గోపాలపట్నం పరిధిలో మండపాలను శనివారం గోపాలపట్నం ఎస్‌ఐ రామకృష్ణ పరిశీలించారు. మండపాల నిర్వహణ ఏవిధంగా ఉండాలన్న విషయాలను నిర్వాహకులకు వివరించారు. తప్పని సరిగా నిబంధనలు పాటించాలని తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పర్యవేక్షించాలన్నారు. నిర్వాహకుల వివరాలు నమోదు చేసుకున్నారు.

నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు

- బలవంతంగా చందాలు వసూలు చేయరాదు.
- మండపాల ఏర్పాటుకు ముందే అనుమతులు తీసుకోవాలి.
- విద్యుత్ దీపాలంకరణ చేసే సమయంలో నాణ్యమైన పరికరాలు, వైర్లు వాడాలి.
- మండపాల సమీపంలో మద్యం సేవించడం, గ్యాంబ్లింగ్ ఆడడం వంటివి చేయరాదు.
- మండపాల వద్ద వలంటీర్స్ పర్యవేక్షణ ఉండాలి.



శ్రీరామ్‌నగర్‌లో వినాయక మండపం వద్ద నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

- మట్టి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలి.
- విగ్రహాల అనుపు ఎప్పుడు చేస్తారో.. ఎక్కడ చేస్తారో ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- మండపాల వద్ద సౌండ్ బాక్స్‌లు రెండు మాత్రమే పెట్టాలి.

ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంది.

- పారిశ్రామిక ప్రాంతంలో ఉదయం సమయంలో 75 డిసిబల్స్, రాత్రి సమయంలో 70 డిసిబుల్స్, కమర్షియల్ ప్రాంతంలో 65 డిసిబుల్స్ మించకూడదు.
- నిమజ్జన ఊరేగింపు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సాగాలి.

జోరుగా విక్రయాలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వినాయక మండపాలు పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు మండపాల వద్దకు వినాయక బొమ్మలను చేర్చారు. మరి కొంత మంది సినిమా సెట్‌లను మరిపించే విధంగా మండపాలు ఏర్పాటు చేశారు. రూ. వెయ్యి మొదలుకుని రూ.40 వేల విలువ గల బొమ్మలు మల్కాపురం,శ్రీహరిపురం మార్కెట్‌లో ఉంచారు. విగ్రహాలను కొనుగోలు చేసేందుకు శనివారం సాయంతత్రం నుంచే మార్కెట్‌కు యువత బారులు తీరారు.



బాజీ జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా వినాయక ప్రతిమలు

రూ. 40 వేలతో బొమ్మ కొనుగోలు చేశాం



మల్కాపురం గొల్లవీధి వద్ద యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. మండపం వద్ద ఏర్పాటు చేసే గణనాథుడిని రూ. 40 వేలకు కొనుగోతుల చేశాం. పాండురంగడు రూపంతో ఉన్న గణనాథుడు మా ప్రాంతానికే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

– పవన్‌యాదవ్, మల్కాపురం

నిబంధనలు పాటించాలి



మండపాలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ శాఖల అనుమతులు తప్పని సరిగా ఉండాలి. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే. భక్తి భావం కలిగే విధంగా వినాయక మండపాలు ఉండాలి. స్టేషన్ పరిధిలోవచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తున్నాం.

– రామకృష్ణ, ఎస్‌ఐ, గోపాలపట్నం

మట్టి విగ్రహాలే మంచివి



సంప్రదాయ బద్ధంగా పూజలు చేసేందుకు మట్టి విగ్రహాలే మంచివి. పురాణాలు ఇదే విషయం చెబుతున్నాయి. అందం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమల వాడడం పెరిగింది. దీంతో కాలుష్య బెడద అధికమైంది. దీని నివారణకు అంతా మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలి.

–చిరంజీవి, సాకేతపురం

చాలా ఏళ్లుగా మట్టి విగ్రహాలే..

చాలా ఏళ్లుగా మట్టి ప్రతిమలనే పూజలకు వాడుతున్నాం. ఇంట్లో పిల్లలకు పర్యావరణంపై అవగాహన కలిగించాం. దీంతో మట్టి విగ్రహాలు వాడడం వల్ల ప్రయోజనాలు తెలుసుకోగలిగారు. ఈ విధంగా ప్రతీ ఇంట్లో మార్పు రావాలి. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న ప్రయత్నం మంచి మార్పునకు దారి తీసింది.

–రామకృష్ణ, శాంతినగర్

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: మట్టి వినాయక ప్రతిమల పంపిణీని ఉత్సాహంగా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సమకూర్చిన మట్టి విగ్రహాలను శనివారం పలువార్డుల్లో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పంపిణీ చేశారు.

- 58వ వార్డు పిలకవానిపాలెంలో వార్డు కార్పొరేటర్ లావణ్య, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి,వార్డు పార్టీ అధ్యక్షుడు గులిగిందల కృష్ణ విగ్రహాలు పంపిణీ చేశారు.
- 59వ వార్డు నక్కవానిపాలెంలో వార్డు సీనియర్ నాయకుడు పుర్రె అప్పారావుయాదవ్ , 60వ వార్డు శ్రీహరిపురం కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత, అంగ రామ్‌ప్రసాద్, ఆడారి హరీష్,సత్తిబాబు తదితరులు ప్రతిమలను పంపిణీ చేశారు.
- 61వ వార్డు మల్కాపురం రెడ్డివీధి రామాలయం వద్ద పార్టీ సీనియర్ నాయకులు కొల్లి నూకరెడ్డి,మంగ,ఎన్.వి.రమణ తదితరులు మట్టి వినాయకులతో పాటు కథ పుస్తకాలు పంపిణీ చేశారు.

సింథియా: జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల్లో మట్టి గణపతి విగ్రహాలను వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, సోమాధుల సురేష్, కొటాన్న రవి, వరపల మహేష్, గంటా వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

గోపాలపట్నం: జేడీ ఫౌండేషన్, గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సంయుక్తంగా గోపాలపట్నం పిన్నమనేని ఫంక్షన్ హాలు వద్ద శనివారం పిన్నమనేని శ్రీనివాసరావు మట్టిప్రతిమలతో పాటు చామంతి మొక్కలు పంపిణీ చేశారు.



ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కలిదిండి బద్రీనాథ్



మట్టి గణపతి ప్రతిమలు, చామంతి మొక్కలు అందిస్తున్న శ్రీనివాసరావు



పిలకవానిపాలెంలో ప్రతిమలు పంపిణీ చేస్తున్న లావణ్య తదితరులు

మట్టి గణపతిని పూజిద్దాం

కంచరపాలెం: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణనాథులను పూజిద్దామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 52,56,57 వార్డుల పరిధిలోని శాంతినగర్, దుర్గానగర్, సాకేతికపురం ప్రాంతాల్లో శనివారం మట్టి గణపతి ప్రతిమల పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 56వ వార్డు నాయకులు ఆడారి శ్రీను, పల్లా ఎర్నికుమార్, సాయిలత, 52వ వార్డు నాయకులు ఆల్పా కృష్ణ, శ్రీదేవివర్మ, జియ్యాని విజయ్‌కుమార్, మారుతి, శ్రీను, రామకృష్ణ, 57వ వార్డు నాయకులు పోలవరపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో ముగిసిన హిందీ వారోత్సవాలు

కంచరపాలెం : జ్ఞానాపురంలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో జరిగిన హిందీ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ శనివారం ముగించారు. శ్రీకృష్ణ విద్యా మందిర్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. సృష్టి క్లబ్ నుంచి శేఖర్‌ప్రసాద్, హిందీ విభాగం నుంచి సంధ్య గురంగ్‌లకు 'దేవనాగరి'పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ప్రతిభ వార్షిక పత్రిక 17వ సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. దీప్తి, ఆషీ యాదవ్, అన్వా, ప్రణతి, ప్రీతిషా, మానస, హర్షిత తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ వార్షిక పత్రికను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

సందడిగా వినాయక ఉత్సవాలు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్‌లోని రామకృష్ణ పాఠశాలలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రామకృష్ణారెడ్డి వినాయక విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య రూపకాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీ రవీంద్రుడు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినాయక చరిత్ర నృత్య రూపకం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కప్పరాడ హైస్కూల్‌లో ఓజోన్ డే



చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో హెచ్‌ఎం విజయమాలిని, ఉపాధ్యాయులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని కప్పరాడ ఉన్నత పాఠశాలలో సోషల్, సైన్స్ టీచర్ల నేతృత్వంలో శనివారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని స్కూల్ హెచ్‌ఎం వి.విజయమాలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఓజోన్ పొరను కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఉపాధ్యాయులు అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన చార్ట్ వర్క్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పి.సీతారామ్, ఎస్.రాథో, గణేష్, శ్రీను, జి.పి.నాయుడు, రమణమ్మ, ఉప్పల కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చేపడుతున్న చర్యలకు ప్రయాణికులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ కోరారు. ఆయన గోపాలపట్నం ట్రాఫిక్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ చాలా కష్టమవుతుందని తెలిపారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో జంక్షన్ వద్ద నాలుగు రోడ్ల నుంచి వాహనాలు నియంత్రణ లేకుండా వస్తున్నాయన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బీఆర్‌టీఎస్ రహదారికి ఎప్రోచ్‌గా ఉన్న సుసర్ల కాలనీ రహదారి, పాత గోపాలపట్నం రహదారి ఇరుగ్గా ఉండడం వల్ల వాహన దారులు ఆయా రహదారుల్లో ఆగకుండా బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు వచ్చి ఆగుతున్నారని తెలిపారు. దీంతో సర్వీసు రోడ్డులో వచ్చే వాహన దారులు ఢీకొట్టే పరిస్థితి నెలకొంటుందని వివరించారు. ఇటీవల జంక్షన్‌లో ఒకవైపు బ్లాక్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అభ్యంతరాల మేరకు తొలగించామన్నారు.

సిగ్నల్ లైట్లు ఉపయోగిస్తాం

బాజీ జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు ఉపయోగించేందుకు ట్రైల్స్ వేస్తామన్నారు. సుసర్ల కాలనీ నుంచి వచ్చే వెళ్లేందుకు ద్విచక్రవాహనాలకే అనుమతించే విధంగా సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్లు ఆటోలు ప్రత్యామ్నాయ రహదారుల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలకు స్థానికులు సహకరించాలని కోరారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడాపోటీలు

గోపాలపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. గోపాలపట్నం బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రత్నవేణి రెండో రోజు ఆటల పోటీలను ప్రారంభించారు. శుక్రవారం బాలురకు పోటీలు నిర్వహించారు. శనివారం బాలికలకు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 14 నుంచి 17 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్‌లో గోపాలపట్నం బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, వాలీబాల్లో ఆర్‌పీ పేట హైస్కూల్, కబడ్డీలో మాధవదార, షటిల్ బ్యాడ్మింటన్‌లో డీఏవీ స్కూల్, ఖోఖోలో మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాల, యోగాలో కె. కాలని హైస్కూల్, టెన్నికాయిట్‌లో కొత్తపాలెం హైస్కూల్, అథ్లెటిక్స్‌లో కప్పరాడ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. గోపాటపల్నం హైస్కూల్ పీఈటీ సత్యకళ, బాలికల ఉన్నత పాఠశాల పీఈటీ కళావతి పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి.



కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

మూగ జీవాల సేవలో..!



గోపాలపట్నం ప్రాంతీయ పశువైద్యశాల

- పెంపుడు జంతువుల నేస్తం ప్రాంతీయ పశువైద్యశాల
- వైద్యసేవల్లో జిల్లాలో రెండో స్థానం
- ఆస్పత్రిలో అధునాతన ఆపరేషన్ థియేటర్
- కలెక్టర్ ప్రత్యేక చొరవతో సమకూరుతున్న సౌకర్యాలు

విశాఖ విద్య: మూగ జీవాలకు వైద్య సేవలు అందించడంలో గోపాలపట్నం ప్రాంతీయ పశువైద్యశాల పెద్ద దిక్కుగా ఉంది. ఎన్‌ఏడీ ఏరియాలో పెంపుడు జంతువుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. వీటికి ఆపద సమయంలో ఆస్పత్రి వైద్యులు అవసరమైన వైద్యం అందిస్తూ వాటికి రక్షణగా నిలుస్తున్నారు. పాడి గేదెలు, ఆవులతో పాటు కోళ్లు, గొర్రెలు, పెంపుడు కుక్కలకు ఇక్కడ తగిన వైద్యం చేస్తున్నారు. ప్రతీ రోజూ 40 కిపైగా పెంపుడు కుక్కలకు వైద్యం అందిస్తున్నారు. ప్రాంతీయ వైద్యశాల పరిధిలోని పెదగంట్యాడ, గాజువాక, గోపాలపట్నం, పెందుర్తి మండలాల్లోని ఏడు పశు వైద్యశాలల ద్వారా మెరుగైన వైద్యం అందేలా డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణ చేస్తున్నారు. దీని పరిధిలో 1962 మొబైల్ వాహనాలు మూడు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా గ్రామాలు, వార్డుల పరిధిలోని సచివాలయాలకు వెళ్లి అవసరమైన పశువులు, పెంపుడు జంతువులకు వైద్యం అందిస్తున్నారు.

సేవల్లో ప్రత్యేకం

పశువులు, పెంపుడు జంతువులకు వైద్యం అందించడంలో గోపాలపట్నం ఆస్పత్రి వైద్యులు విశేష కృషి చేస్తున్నారు. వైద్య సేవలు అందించడంలో గోపాలపట్నం ఆస్పత్రి రెండో స్థానంలో నిలిచింది. అసిస్టెంట్ డైరెక్టర్ క్యాడర్ గల ఒక వైద్యుడు, ఒక లైవ్ స్టాక్ అసిస్టెంట్(ఎల్‌ఏ) సేవలు అందిస్తున్నారు. పెంపుడు జంతువులకు ఆపరేషన్లు చేయడానికి అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉంది. డిజిటల్ ఎక్స్‌రే మిషన్ సైతం ఆస్పత్రికి మంజూరైంది. దీని నిర్వహణకు రేడియోగ్రాఫర్‌ను నియమించారు.

మెరుగుపడుతున్న సౌకర్యాలు

ప్రాంతీయ పశువైద్యశాల పక్కనే సంత నిర్వహిస్తున్నారు. దీని వల్ల ఆస్పత్రికి వెళ్లేందుకు కూడా దారి లేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. సేవలు అందించటంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఇక్కడి వైద్యుడు రవికుమార్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆస్పత్రి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.8.7 లక్షలు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. త్వరలోనే ఈ నిధులతో ఆస్పత్రి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టనున్నారు. మరో వైపు డాక్టర్ రవికుమార్ తనకు ఉన్న పరిచయాలతో స్నేహితులను సంప్రదించి ఆస్పత్రి భవనం ముందు రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా పశువుల స్టాండ్, అవసరమైన చిన్న చిన్న పరికరాలను సమకూర్చేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో ఆస్పత్రిలో వసతులు మెరుగుపడ్డాయి.



పెంపుడు కుక్కకు వైద్యం అందిస్తున్న డాక్టర్ రవికుమార్

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రే లక్ష్యం



ఆస్పత్రికి పెంపుడు జంతువులు ఎక్కువగా వైద్యం కోసం తీసుకొస్తున్నారు. వీటికి ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం అందించడం ఖర్చుతో కూడుకున్నది. ప్రభుత్వాస్పత్రిలో ఎలాంటి వైద్యమైనా ఉచితంగానే అందిస్తున్నాం. ఆపరేషన్ థియేటర్ ఉన్నందున, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలనే కోరిక ఉంది. ఈ విషయంలో ఉన్నతాధికారుల సహకారం ఉంటుందనే నమ్మకం ఉంది.

–డాక్టర్ ఎ. రవికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల

అప్రమత్తతతో నేరాలకు చెక్

హార్బర్ ఏసీపీ మోసెస్‌పాల్

మల్కాపురం: గుర్తు తెలియని వ్యక్తులు మన చుట్టూ తిరుగుతూ మనల్ని మోసం చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయని.. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హార్బర్ ఏసీపీ మోసెస్‌పాల్ అన్నారు. నేరాల బారిన పడకుండా.. నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాన్ని శనివారం ఆయన మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కంటి ముందుగాని, మీ ఏరియాలోఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా.. జరుగుతాయని అనుమానం ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. గంజాయి,సారా, మద్యం తాగిన మైకంలో పలు నేరాలకు కొంత మంది పాల్పడుతుంటారని అలాంటి వారిని గుర్తించాలన్నారు. యువత మద్యం,గంజాయి,ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా మల్కాపురం సీఐ జి.డి.బాబు (9440796023), స్టేషన్ ఎస్‌ఐ 9440796035 లేదా 0891-2577392 నెంబర్‌లను సంప్రదించాలన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న ఏసీపీ మోసెస్ పాల్, సీఐ జి.డి.బాబు

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

ఉక్కునగరం: ఉక్కునగరం అంబేడ్కర్ కళాక్షేత్రం పక్కన ఉన్న విశ్వకర్మ ఆలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. విశ్వకర్మ పూజా కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న వేడుకలకు స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు హాజరవుతున్నారు. అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

అభివృద్ధికి పెద్దపీట

మల్కాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమనియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డులోని పలు ప్రాంతాల్లో సుమారు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా ప్రతి వార్డులో రూ. 3 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల ధనలత, అంగ రామ్‌ప్రసాద్,ఆడారి హరీష్,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్